'కంది' ఆశలపై నీళ్లు

- పత్తిలో అంతరపంటగా 4060 ఎకరాల్లో సాగు
- అకాల వర్షాలతో రాలుతున్న పూత, కాయ
- కాయ దశలోనే చీడ పురుగులతో ముప్పు



వర్షాలకు ముందు కందిలో పూత

వాంకిడి: మండలంలో పత్తి పంట అధికంగా సాగవుతుండగా ఆ తర్వాత అధిక శాతం అంతర పంటగా కందిని సాగు చేస్తున్నారు. పత్తి పూత, కాయ దశలోనే వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు అనుకున్నంతగా దిగుబడి సాధించలేక పోయారు. దీంతో రైతులు అంతర పంటగా సాగు చేసుకున్న కందిపైనే ఆశలు పెట్టుకున్నారు. కంది పంటలో పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ గత కొన్ని రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులు ఆందోళనకరంగా మారుతున్నాయి. వారం రోజుల నుంచి మబ్బులుగా ఉన్న వాతావరణం కంది పూతపై తీవ్ర ప్రభావాన్ని చూపెడుతోంది. గత రెండు రోజుల నుంచి మండలంలో అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత, కాయ దశలో ఉన్న కంది మబ్బులు, అకాల వర్షాల కారణంగా రాలిపోవడమే కాకుండా చీడపురుగుల బారిన పడి దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటిస్తే చీడపీడల నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు.

4060 ఎకరాల్లో కంది సాగు..

మండలంలో పత్తి పంట 34,910 ఎకరాల్లో సాగవుతుండగా కందిని పత్తిలో అంతర పంటగా సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 4060 ఎకరాల్లో కంది సాగుచేస్తున్నారు. వానాకాలంలో అంతర పంటగా సాగు చేసిన కంది మొదటి నుంచి ఆశాజనకంగా ఉంది. పత్తిలో అనుకున్నంత దిగుబడి రాకపోయిన కందితో నష్టాన్ని భర్తీ చేద్దామనుకున్న రైతులకు అకాల వర్షాలు శాపంగా మారుతున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసుకుంటున్న రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లవుతుంది. వాతావరణంలో ఏర్పడే మబ్బులు సమస్యగా మారుతున్నాయి. ప్రస్తుతం పూత, కాయ దశలో ఉన్న కందికి మబ్బులు, అకాల వర్షాలు సమస్యగా మారుతున్నాయి. ఇలాంటి వాతావరణం వల్ల పూత రాలడమే కాకుండా పిందె దశలో ఉన్న కంది కాయలకు చీడపురుగులు ఆశించే అవకాశాలు అధికంగా ఉంటాయి. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడమే కాకుండా రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. మండలంలో శుక్రవారం, శనివారం మోస్తారు వర్షాలు కురువగా చెట్టు మీదున్న పూత నేల రాలింది. వాతావరణం సహకరిస్తే తప్ప కంది రైతు కోలుకునే పరిస్థితులు కానరావడం లేదు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు కంది కాయకు జిగురు పట్టకుండా మందులు పిచికారీ చేస్తే కొంత ఊరట లభించే అవకాశాలు ఉన్నాయి. మబ్బులు, అకాల వర్షాల కారణంగా పురుగులు ఆశించే అవకాశాలు అధికంగా ఉన్నందున రైతులు ఏమామెక్టిన్, క్లోరాంటిల్ నిలోఫోర్, స్పైనోసోల్, ఫ్లూబెండామైడ్ వంటి రసాయనాలను అధికారుల సూచనల మేరకు మోతాదులో పంటకు వాడాలి. దీంతో కాయ దశలో ఉన్న కందిని కాపాడుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.



వర్షం తర్వాత రాలిన పూత

పూత రాలుతుంది..



పత్తిలో అంతర పంటగా కందిని సాగు చేస్తున్నాను. పత్తి పూత, కాయ దశలోనే వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్న కంది మబ్బులతో పూత రాలిపోతుంది. కాయకు చీడ పురుగులు ఆశిస్తున్నాయి. గత రెండు రోజులుగా వర్షాలు సైతం కురుస్తుండటంతో పూత విపరీతంగా రాలిపోతుంది.

– బొర్కుటి విజయ్‌కుమార్, రైతు

అకాల వర్షాలతో ఇబ్బందులు



గత కొన్ని రోజులుగా వాతావరణం కంది పంటపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పత్తిలో ఆశించినంతగా దిగుబడి రాలేదు. కందిపైనే ఆశలు పెట్టుకోగా ప్రస్తుతం మబ్బులు, అకాల వర్షాలు ఇబ్బందులు పెడుతున్నాయి. పూత రాలిపోతుంది. పిందె దశలో ఉన్న కాయకు చీడపీడలు ఆశిస్తున్నాయి. మబ్బులు తొలిగిపోతే కాని కంది పంట చేతికి అందేలా లేదు. ప్రభుత్వం రైతుల నష్టాలను గుర్తించాలి.

– పోశెట్టి, రైతు

క్లుప్తంగా

జీవన భృతి చెల్లించాలి



కుమురం భీం చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

తిర్యాణి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం జీవనభృతి చెల్లించాలని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆటోల బంద్ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు, ఆటో యూనియన్ నాయకులు జుంగోని లింగమూర్తి గౌడ్, పెరుమాండ్ల ఆనంద్, పుదారి మల్లేశ్, పులి కృష్ణ, కొండ రవి తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కౌటాల: మండలంలోని తలోడి గ్రామ సమీపంలో శనివారం వేకువజామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్‌లు పట్టుకున్నారు. చింతలమానెపల్లి మండలంలో బాబాపూర్ గ్రామం నుంచి ఆటోలో తలోడికి తరలిస్తున్న 7.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యం సీజ్ చేసి ఆటోను కౌటాల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. అక్రమంగా రేషన్ తరలిస్తున్న బాబాపూర్ గ్రామానికి ఆటో డ్రైవర్ కొలిపాక సాయికిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తేమ లేకుండా చూడాలి



ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న తహసీల్దార్

తిర్యాణి: వరి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే ధాన్యంలో 17 శాతం కన్నా తక్కువ తేమ ఉండేలా చూసుకోవాలని తహసీల్దార్ సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలో గంభీరావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వరి ధాన్యంలో ఉన్న తేమను యంత్రంతో పరిశీలించారు. మంచి ధాన్యం తీసుకొచ్చే వారికి గరిష్ట ధర వర్తిస్తుందన్నారు.

ఆటోడ్రైవర్ల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న ఆటో డ్రైవర్లు

తిర్యాణి: మండలంలోని సమ్మక్క గద్దెల నుంచి శ్రీ ఇన్‌క్లైయిన్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో శనివారం ఆటో డ్రైవర్లు శ్రమదానం చేసి గుంతలను మట్టితో పూడ్చారు. వారు మాట్లాడుతూ గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ప్రయాణించడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు.

'అక్రమంగా నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయాలి'

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలోని సింగరేణి క్వార్టర్లలో అక్రమంగా నివాసం ఉంటున్న వారు వెంటనే ఖాళీ చేయాలని ఏరియా జీఎం శ్రీనివాస్ హెచ్చరించారు. గోలేటి, మాదారంలోని సింగరేణి డీ టైపు క్వార్టర్లతో పాటు ఎస్‌డీ టైపు క్వార్టర్లలో కొందరు అక్రమంగా నివాసం ఉంటున్నట్లు యాజమాన్యం దృష్టికి వచ్చిందన్నారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లలో నివాసం ఉండటం ప్రమాదకరమన్నారు. అంతేగాక విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు సైతం తమ దృష్టికి వచ్చిందన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

భీమిని: మండలంలోని కేస్లాపూర్ గ్రామ పంచాయతీలో శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సుమారు రూ.20లక్షలతో కొత్తగూడ, గట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలకు, కేస్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణం, రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. వడాల నుంచి చిన్నగూడి పేట గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ధరణి వల్ల ఏర్పడిన భూ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. నాయకులు నర్సింగరావు, లక్ష్మీనారాయణ, ధనుంజయులు, దామోదర్ గౌడ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నైపుణ్యాలు వెలికితీసేందుకే పోటీలు



తిర్యాణి: క్రీడాకారులతో ఎంపీడీవో మల్లేశ్



కౌటాల: పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

తిర్యాణి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీయడానికే సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేముల మల్లేశ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో గ్రామీణాస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలిచినా, ఓడినా క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, పీడీ గుండం లక్ష్మణ్, అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

10 నుంచి సీఎం కప్ పోటీలు

లింగాపూర్: మండల కేంద్రంలో మండల స్థాయి సీఎంకప్ పోటీలను ఈనెల 10 నుంచి 12వరకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణారావు, తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పోటీల్లో అథ్లెటిక్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను లింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్‌కార్డు జిరాక్స్‌ను సంబంధిత పంచాయతీ కార్యదర్శికి ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్రీడలతోనే భవిష్యత్తు

కౌటాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శనివారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో సీఎంకప్ గ్రామస్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని తెలిపారు. క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం పెరుగుతుందన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని తెలిపారు. క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకులు పకడ్బందీగా సీఎం కప్ పోటీలను నిర్వహించాలని, పోటీల ప్రదేశంలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, హెచ్ఎం నానాజీ, చక్రపాణి, బానీష్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న గుర్తింపు సంఘం'



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు

రెబ్బెన: స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో అంగీకారం కుదరని అంశాలను సైతం అంగీకారం కుదిరినట్లు చెప్పుకుంటూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికులను తప్పుదోవ పట్టిస్తుందని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. శనివారం గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో సెంట్రల్ కమిటీ సభ్యులు, బ్రాంచి కమిటీ, ఫిట్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ ఇచ్చిన అనేక హామీలను అమలు చేస్తారని కార్మికులు గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారన్నారు. కాని వారి ఆశలను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు అడియాశలు చేశారని ఆరోపించారు. సెంట్రల్ కమిటీ నాయకులు ఓజియార్, బ్రాంచి కార్యదర్శి శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఏరియా నాయకులు ఎస్‌కే ఇనూస్, ఫిట్ కార్యదర్శి ఆరిఫ్, కిష్టస్వామి, కుమార్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం



బాలమేళా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రెబ్బెన: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణీ, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సాదియా రుక్సానా అన్నారు. మండలంలోని కొండపల్లిలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు బాలమేళా ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారంతో చిన్నారులు, గర్భిణీ, బాలింతలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా కేంద్రాలకు పంపించాలని సూచించారు. పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన పిల్లలు పాఠశాలల్లో నేర్చుకున్న ఆటపాటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళావతి, టీచర్లు సంతోషి, రాజేశ్వరీ, షకీలా, తిరుపతమ్మ, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.



చెట్టుపైన దసలి(పట్టు) పురుగులు

మైమరిపించే ప్రకృతి సోయగం



మొసలి చర్మంలా బెరడును కలిగి ఉన్న మద్ది చెట్టు

చింతలమానెపల్లి: ప్రకృతిలో అందాలకు, విచిత్రాలకు కొదువలేదు. మనిషి మనుగడే ప్రకృతితో ముడిపడి ఉంది. మండలంలోని ఖర్జెల్లి రేంజ్ అడవుల్లో అరుదైన వృక్షాలు, జంతుజాలం నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. దశాబ్దాలుగా పెరుగుతున్న వృక్షాలు పలు వింతలకు నిలయాలుగా ఉన్నాయి. ఖర్జెల్లి రేంజ్‌లోని పలు గ్రామాల పరిధిలో పట్టుపురుగుల పెంపకం చేపడుతున్నారు. దీనిలో భాగంగా లార్వా నుంచి పురుగు దశలో ఉన్నప్పుడు ఆకుపచ్చగా వెలుగుతున్నట్లు కనిపించే గొంగళిపురుగులు చెట్ల కాండాలపై నుంచి ఆకులను తినడానికి వెళ్తుంటాయి. నల్లమద్ది చెట్లకు మరోపేరు మొసలి బెరడు చెట్లు. వీటి కాండంపై బెరడు మొసలి చర్మంలా దళసరిగా పొలుసులుగా కనిపిస్తుంది. నీటిని నిల్వ ఉంచే ప్రత్యేక లక్షణం ఈ చెట్టుకు ఉంది. ఎక్కడైనా ఎలాంటి పరిస్థితిలోనైనా మొలకెత్తి వృక్షంలా మారే లక్షణం రావి చెట్టుకు ఉంటుంది. ఖర్జెల్లి అడవుల్లో వేప, నల్లమద్ది, మర్రిలాంటి వృక్షాలపై మొలకెత్తి కాండాలను వేర్లతో అల్లుకుని రావి చెట్లు పెరిగాయి. ఇలాంటి ఎన్నో చిత్రాలు ఖర్జెల్లి రేంజ్‌లో దర్శనమిస్తూ ప్రకృతి ప్రేమికులను అలరిస్తున్నాయి.

కొనసాగిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల రిలే దీక్షలు



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షల్లో ఉద్యోగులు



ఆసిఫాబాద్‌రూరల్: వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేయాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారం రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వానికి ఇచ్చిన సమ్మె నోటీసు నేపథ్యంలో రెండు రోజుల రిలే దీక్షల్లో భాగంగా శనివారం కొనసాగించామన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తుకారాం, నగేశ్, సంతోష్, అనూప్‌కుమార్, సందీప్, దేవేందర్, రమేశ్, రాజేష్, తిరుపతి, శృతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని శనివారం సమగ్ర శిక్షా ఉద్యోగులు రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యులు వెంకటేశ్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ న్యాయం చేయాలని కోరారు. నాయకులు సంతోష్, నగేశ్, తిరుపతి, రమేశ్, ఆనంద్ రావు, నాగసుధ, శృతిక, తుకారాం, సత్యనారాయణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలు

ఆసిఫాబాద్‌అర్బన్: సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ హరిహర అయ్యప్పస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు నాగేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అష్టోత్తరాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో స్వాములు కలకుంట్ల శ్రీధర్, మోహన్, బాలరాము, కిషన్, ఆశిష్, సంతోష్, చంద్రమోహన్, కేదారి, రమేశ్ దేవునూరి, తదితరులు పాల్గొన్నారు.

డీఎంజీని కలిసిన జీఎం



డీఎంజీకి మొక్క అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: నస్పూర్‌లోని సీసీ అతిథి గృహంలో శనివారం డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ (డీఎంజీ) కే. సురేంద్రమోహన్‌ను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంజీకి మొక్కను జ్ఞాపికగా అందజేశారు. అనంతరం బెల్లంపల్లి ఏరియాలో త్వరలో ప్రారంభించనున్న ఎంవీకే ఓసీపీ ఎల్‌వోసీ అనుమతులు, ఇతర పనుల ప్రగతిపై ఆయనతో చర్చించారు.

మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు



వాంకిడి: స్థలం చదును చేయిస్తున్న అధికారులు



సిర్పూర్(టి): స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

వాంకిడి: మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి సంబంధించిన పనులను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో అజీజుద్దిన్ శనివారం పరిశీలించారు. మండలానికి ఒకటి చొప్పున నమూన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలని హౌజింగ్ అధికారుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో మో డల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టనున్నట్లు తె లిపారు. ఇంటి నిర్మాణానికి స్థలాన్ని చదును చేయించామన్నారు. ఎంపీవో ఖాజా అజీజుద్దీన్ ఉన్నారు.

స్థలం పరిశీలన

సిర్పూర్(టి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మాణానికి శనివారం ఎంపీడీవో సత్యనారాయణ స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో గెలుపొందాలి



పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజయం సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం మండలంలోని వంటివాగు కాలనీలో సీఎం కప్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం కప్ క్రీడా పోటీలను గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదని, జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణిస్తున్నారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. డీఎస్వో మీనారెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్, పీఈటీ రాకేశ్, మాజీ ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి



భోజనం చేస్తున్న రాజాబాబు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని గురుకుల అడ్మిన్ అసిస్టెంట్ సెక్రటరీ రాజబాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వసతిగృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో భద్రయ్య, వైస్‌ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.